బురదకయ్యలుగా రోడ్లు




ఈడుపుగల్లు జగనన్న లే అవుట్‌లో నీరు నిలిచి అధ్వానంగా మారిన రహదారులు

- నడవాలన్నా ఇబ్బందే
- దోమలకు నిలయంగా మారుతున్న వైనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- ఈడుపుగల్లు జగనన్న లే అవుట్ వాసుల అగచాట్లు

కంకిపాడు: వాహనాల ధాటికి రోడ్లు ధ్వంసం అయ్యాయి. బురదకయ్యలుగా తయారయ్యాయి. కనీసం నడిచేందుకు సైతం వీలు లేకుండా మారాయి. చిన్న పాటి వర్షం వచ్చినా మురుగు కదలక, రాకపోకలు సాగక ఈడుపుగల్లు జగనన్న లే అవుట్ ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి పరిష్కరించాల్సిన పంచాయతీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాల కింద గ్రామంలోని చింతలతోటలో సామాజిక స్థలాన్ని సేకరించి నివేశనస్థలాలను కేటాయించారు. ప్రస్తుతం ఆ స్థలంలో లబ్ధిదారులు శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. పలువురు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నారు. నిర్మాణ సామాగ్రి తరలింపుతో రహదారులు ధ్వంసం అయ్యాయి. జగనన్న లే అవుట్‌లో నిర్మించిన రబ్బిష్ రోడ్డు ధ్వంసం అయ్యి అడుగున ఉన్న మట్టి పైకి వచ్చింది. దీంతో రాకపోకలకు ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, నిలిచిన వర్షపునీరు

దోమల ఉత్పత్తి కేంద్రంగా రహదారులు...


చిన్న పాటి వర్షం కురిసినా లే అవుట్‌లోని రెండు ప్రధాన అంతర్గత రహదారులు నీటితో నిండిపోతున్నాయి. రోజుల తరబడి నీరు కదలడం లేదు. వర్షపునీరు నిలిచిపోయి ముురుగెత్తుతోంది. దోమల ఉత్పత్తి కేంద్రంగా రహదారులు మారాయి. రోడ్డు మీద నిలిచి ఉంటున్న నీటిలో నడిచి ఇళ్లలోకి, ఇళ్ల నుంచి బయటకు వెళ్లే సమయంలో నరకం చూస్తున్నారు. ద్విచక్ర వాహనాలను ఇళ్ల వద్దకు చేర్చలేక ప్రధాన రహదారి వెంబడే వదిలివెళ్లాల్సిన పరిస్థితి. అక్కడక్కడ ఉన్న ఖాళీస్థలాల్లో నీరు నిలిచిపోయి, మొక్కలు పెరగడంతో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటుంది. దోమలు విజృంభించి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం...

రోజుల తరబడి వర్షపునీరు రహదారుల్లో నిలిచినా ప్రజల ఇబ్బందులను పంచాయతీ కన్నెత్తి చూడటం లేదు. ఆయిల్ ఇంజన్ల ద్వారా నిలిచిన నీటిని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాల్సి ఉన్నా ఆ వైపు దృష్టి సారించడం లేదు. మురుగు నిలిచిన ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొనకుండా బ్లీచింగ్ చల్లడం, దోమల మందు ఫాగింగ్ చేయడం వంటివి చేయకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణ చర్యలను పంచాయతీ అధికారులు విస్మరిస్తున్నారు. ఫలితంగా ఇక్కడి ప్రజలు ఇక్కట్లతో, అవస్థలతో జీవనం సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది.

వడపోతకు ఉక్కపోత

- జీవనశైలితో పెరుగుతున్న కిడ్నీ వ్యాధులు
- మధుమేహం, హైపర్ టెన్షన్‌లు ప్రధాన కారణాలు
- ఆహారంలో పెస్టిసైడ్స్ అవశేషాలు కిడ్నీలపై ప్రభావం
- విచ్చలవిడిగా వాడిన కొన్ని రకాల మందుల ప్రభావం
- ముందస్తు చర్యలతో ఆరోగ్యంగా ఉంచుకునే అవకాశం



లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవనశైలి వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, ఒబెసిటీల కారణంగా కిడ్నీ వ్యాధుల బారినపడే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మరోవైపు ఆహారంలో పెస్టిసైడ్స్ అవశేషాలు, కల్తీ ఆహారం కూడా కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. విజయవాడలోని మూత్ర పిండాల వైద్యులను ప్రతిరోజూ 500 మందికి పైగా సంప్రదిస్తున్నారు. అంతేకాదు నిత్యం 80 నుంచి 100 మంది వరకూ రెండు కిడ్నీలు పాడైన బాధితులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఒక్క విజయవాడ ప్రభుత్వాస్పత్రిలోనే ప్రతిరోజూ 30 నుంచి 40 మందికి మూడు షిఫ్టుల్లో డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. కిడ్నీ వ్యాధులకు గురవుతున్న వారిలో 60 శాతం మందికి మధుమేహం, రక్తపోటు కారణం కాగా, 10 నుంచి 15 మంది వంశపారంపర్యం, జన్యుపరమైన సమస్యలతో కిడ్నీ వ్యాధులబారిన పడుతున్నారు. జీవనశైలి వ్యాధుల కారణంగా కిడ్నీలు దెబ్బతింటున్న నేపథ్యంలో కిడ్నీ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కిడ్నీల ఆరోగ్యం కోసం....

- కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలి వ్యాధులు సోకకుండా జీవన విధానాన్ని మార్చుకోవాలి.
- మధుమేహం, రక్తపోటు ఉన్న వారు వాటిని అదుపులో ఉంచుకుంటూ, ప్రతి ఆరు నెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు (సీరమ్ క్రియాటిన్, యూరిన్ అల్బుమన్) చేయించుకోవాలి.
- వంశపారంపర్యంగా కిడ్నీ వ్యాధులు ఉన్న వారు ముందుగానే ఏడాదికి ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవడం మంచిది.
- జన్యుపరమైన లోపాలను గుర్తించేందుకు ఇప్పుడు జనిటిక్ ఎనాలసిస్ టెస్టులు అందుబాటులోకి వచ్చాయి. దాని ద్వారా ముందే వ్యాధులు వచ్చే అవకాశాన్ని తెలుసుకోవచ్చు.

డయాలసిస్‌తో జీవితం పొడిగింపు....

రెండు కిడ్నీలు పూర్తిగా పాడైన వారికి ఇప్పుడు డయాలసిస్ వరంలా మారింది. వైద్యులు నిర్దేశించిన విధంగా డయాలసిస్ చేయించుకుంటే కొన్ని సంవత్సరాల పాటు జీవనాన్ని పొడిగించ గలుగుతున్నారు. అదే సమయంలో కొందరు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకుంటున్నారు. ఇలా కిడ్నీ వ్యాధులకు సంబంధించి అధునాతన చికిత్సలు అందుబాటులోకి రావడంతో రెండు కిడ్నీలు పాడైన వారి జీవితాలను సైతం కొంత కాలం పొడిగించగలుగుతున్నారు.

కిడ్నీ వ్యాధులకు కారణాలు....

- క్రానిక్ కిడ్నీ వ్యాధులు
- అదుపులో లేని మధుమేహం
- హైపర్ టెన్షన్
- ఒబెసిటీ
- వంశపారంపర్యంగా
- జన్యుపరమైన లోపాలు
- విచ్చలవిడిగా నొప్పి నివారణ మాత్రలు వాడటం
- ఆహారంలో పెస్టిసైడ్స్ అవశేషాలు, కల్తీ ఆహారం

అక్యూట్ కిడ్నీ వ్యాధులు...

- కిడ్నీలో రాళ్లు ఉన్నప్పుడు
- కిడ్నీ ఇన్‌ఫెక్షన్స్ వచ్చినప్పుడు
- పాయిజన్ సేవించిన వారికి
- డెంగీ, మలేరియా జ్వరాలు సోకిన కొందరిలో
- డిహైడ్రేషన్‌కు గురైనప్పుడు
- క్రానిక్ వ్యాధులు సోకిన వారిలో ఒకసారి జరిగిన నష్టాన్ని తిరిగి వెనక్కి తీసుకు రావడం కుదరదు. ఇంకా ఎక్కువ నష్టం జరగకుండా మందుల ద్వారా నియంత్రించుకోవచ్చు.
- అక్యూట్ కిడ్నీ వ్యాధులకు సంబంధించి డయాలసిస్, మందుల ద్వారా పూర్తిగా నివారించవచ్చు. పాయిజన్ కేసులు, ఇతర పాయిజన్ ఇచ్చే మందులు మింగిన వారికి హిమోపెరిఫ్యూజన్ డయాలసిస్ ద్వారా రక్తాన్ని శుద్ధి చేసే విధానం అందుబాటులోకి వచ్చింది.

అవగాహన ఎంతో ముఖ్యం



కిడ్నీ వ్యాధులకు సంబంధించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. వ్యాధి సోకిన తర్వాత చికిత్స పొందడం కంటే, ముందుగా నివారించుకోవడం ఎంతో మేలు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు ఉన్న వారు ఆ వ్యాధులను అదుపులో ఉంచుకోవడంతో పాటు, ప్రతి ఆరు నెలలకు కిడ్నీ పరీక్ష చేయించుకోవాలి. వంశపారంపర్యంగా కిడ్నీ వ్యాధులున్న వారు ఏడాదికోసారి పరీక్షలు చేయించుకోవాలి. రెండు కిడ్నీలు పాడైన వారికి డయాలసిస్ ద్వారా కొన్నేళ్లపాటు జీవితాన్ని పొడిగించగలుగుతున్నాం.

డాక్టర్ ఎంవీ సాయికృష్ణ, మూత్రపిండ వ్యాధుల నిపుణులు, విజయవాడ

దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ అన్నారు. స్థానిక దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అన్నసంతర్పణ సమితి ఆధ్వర్యాన దాతల సహకారంతో పలకలు, పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ విద్యార్థులు పలకలు, బలపాలు, పుస్తకాలు లేక అవస్థలు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తాము సమితి, దాతల సహకారంతో వాటిని కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. సరస్వతి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి అందజేసిన అన్నసంతర్పణ సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు తుమ్మలపల్లి లక్ష్మీ శ్రీనివాసన్, జూలూరు శోభనాచలపతి గుప్తా, పొత్తూరు వంశీకృష్ణ, గోపు విశ్వనాథ్, సమితి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేరంటాలమ్మకు ఆషాఢం సారె సమర్పణ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఆషాఢం సారెను సమర్పించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు తొలుత ముగ్గురమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ వెంట తెచ్చిన పసుపు, కుంకుమ, పలు రకాల పుష్పాలు, స్వీట్లు, గాజులతో పేరంటాలమ్మకు సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ఉంగుటూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉంగుటూరు ఎస్‌ఐ రవిచంద్ర కుమార్ సూచించారు. ఉంగుటూరు ప్రధాన కూడలి వద్ద బుధవారం వాహన చోదకులకు హెల్మెట్ వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, గన్నవరం డీఎస్పీ జయసూర్య ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని, ఇస్తే రూ. 25వేలు జరిమాన విధిస్తామని హెచ్చరించారు. రహదారి భద్రత సూచనలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తన భార్య కనిపించడం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. గోసాల గ్రామంలో గేదెల శంకర్ రావు, తన భార్య అలేఖ్య అలియాస్ సత్యవతితో ఉంటున్నాడు. వీరి స్వగ్రామం విజయనగరం జిల్లా బూజివలస. శంకర్ రావు తాపీ కార్మికుడు. వీరు ఆర్నెల్ల క్రితం గోసాలలో కాపురం పెట్టారు. పెళ్లి అవ్వక ముందే అలేఖ్య మరో వ్యక్తితో మాట్లాడుతుండటంతో ఆమె వద్ద నుంచి ఫోన్ తీసేసుకున్నారు. గత నెల 29న ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి అదృశ్యమైంది. భార్య ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో శంకర్ రావు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పోరంకిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా బీజేఆర్ నగర్, నిడమానూరు రోడ్డు, పోరంకి సెంటర్, ప్రభునగర్, బందరు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రైతులు కలుపు నివారణ పద్ధతులు పాటించాలి



అజ్జంపూడి(గన్నవరం): రైతులు సమగ్ర కలుపు యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని జిల్లా పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని అజ్జంపూడి గ్రామంలో బుధవారం కలుపు నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ వరి సాగులో కలుపు నివారణ కోసం ముందస్తుగా మందులు వాడటం మంచిదన్నారు. ఇంటిగ్రేటెడ్ టెస్ట్ యాజమాన్యంలో భాగంగా ముువ్వ పురుగు, సుడి దోమలను అరికట్టడానికి క్రిమిసంహారక మందుల వినియోగంతో పాటు అప్పుడప్పుడు చేలను ఎండబెట్టాలని సూచించారు. పొలంలో తేమగా ఉన్నప్పుడు మాత్రమే కలుపు నివారణ మందులు వినియోగించడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. అనంతరం రైతులు ఎంటీయూ–1318 రకం వరి విత్తనాలకు బదులుగా బీపీటీ–2231 విత్తనాలను రాయితీపై సరఫరా చేయాలని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం ఏడీఏ కె. శ్రీనివాసరావు, ఏఈ బి.పద్మజ, మండల వ్యవసాయాధికారిణి ఎస్‌ఎల్.తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనం అలవర్చుకోవాలి

కంకిపాడు: ఆరోగ్యవంతమైన జీవనం అలవర్చుకోవాలని కోలవెన్ను ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కె.రాగలత సూచించారు. ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యాన గొల్లగూడెంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో జీవన విధానం, ఆహార అలవాట్లు, ఆయుర్వేద వైద్య ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. అనంతరం రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రాగలత మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. వృద్ధులు ఆహార అలవాట్లు మార్చుకోవడం, జీవన విధానంలో మార్పులు తేవడం ద్వారా అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. కోలవెన్ను కేంద్రంగా ఉన్న పంచకర్మ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ సుజాత డొక్కల మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది డాక్టర్ బి.భాస్కర్‌బాబు, డాక్టర్ జాయిసి, డాక్టర్ షేక్ ఫహద్, బి.లావణ్య, టి.గోపి, కె.ధనలక్ష్మి, జె.వెంకటేశ్వరరావు, డి.రసూల్, ఎస్.శ్రావణి పాల్గొన్నారు.



గొల్లగూడెంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఆయుర్వేద వైద్యులు

నిరంతర విద్యుత్‌కు చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశించారు. పోరంకిలోని తన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కానూరు, ఉయ్యూరు ప్రాంతాల్లో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లను నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. పెనమలూరు మండల పరిధిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉన్న కారణంగా ప్రభునగర్, పెద పులిపాక, యనమలకుదురు, కానూరు 100 అడుగుల రోడ్డు, ఉయ్యూరు మార్కెట్ యార్డులో నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజీ, తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. సోలార్ విద్యుత్ ఏర్పాటుచేసుకుంటే సబ్సిడీ ఉంటుందని, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు, ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్, ఈఈ టెక్నికల్ ఉప్పలపాటి హనుమయ్య, కానూరు ఏడీఈ బోడేపూడి నవీన్‌కుమార్, అధికారులు పి.రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆయిల్‌పామ్ సాగు ఎంతో లాభదాయకంగా ఉంటుందని బాపులపాడు మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్ అన్నారు. బాపులపాడు మండలంలోని రేమల్లే, మడిచర్ల గ్రామాల్లో ఉద్యాన శాఖ, పతాంజలి ఫుడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిచంద్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేపట్టేందుకు ఆసక్తి చూపిన రైతులకు ప్రభుత్వం రాయితీపై మొక్కలు పంపిణీ చేస్తుందని తెలిపారు. తోటలకు దేశీయ మొక్కలకైతే హెక్టారుకు రూ.20 వేలు, దిగుమతి చేసుకున్న మొక్కలకై తే హెక్టారుకు రూ.29 వేలు చొప్పున రైతులకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు వివరించారు.

గొల్లపూడి కాల్వ సాగునీటి కోసం ఎదురుచూపులు

నున్న(విజయవాడరూరల్): గొల్లపూడి కాల్వ సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సాగులో వరినాట్లు వేసే రైతులు నీటి కోసం వేచి చూస్తున్నారు. అడపా దడపా కురుస్తున్న వర్షంతో వరినారు పెరిగి నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ దశలో నాట్లు వేసేందుకు కాల్వ ద్వారా నీరు ఎప్పుడు వస్తుందాని రైతాంగం ఎదురు చూస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో పంట కాల్వ బాగు చేయడం, నీటి విడుదలకు మోటార్లు సిద్ధం చేయడం లాంటి పనులు నిర్వహించకపోవడంతో ఈ సీజన్‌కు సాగునీరు వస్తాయా అనే అనుమానం రైతుల్లో నెలకొంది. ఈ కాల్వ ఆయకట్టు కింద గొల్లపూడి, విద్యాధరపురం, జక్కంపూడి, అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, విలేజి కండ్రిక, నున్న, ముస్తాబాదు గ్రామాల్లోని దాదాపు 14వేల ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. గొల్లపూడి కాల్వలో దట్టంగా పెరిగిన తూటుకాడ, ఇతర వ్యర్థాలు ఉండటంతో ప్రభుత్వ పరంగా కాల్వను అభివృద్ధి చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతాంగం అంటోంది. ఏపీఐడీసీ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి ఖరీఫ్ పంటల సాగుకు నీరు విడుదల చేసే విషయాన్ని తెలియజేయాలని రైతులు కోరుతున్నారు.



గొల్లపూడి కాల్వ

రేపు ఎమ్మెల్యే యార్లగడ్డ సమీక్ష సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో వైద్య ఆరోగ్యం, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలపై పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెనమలూరు: వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ పెనమలూరు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి డిమాండ్ చేశారు. జాతీయ కార్మికుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం పోరంకిలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును తిరిగి అమలు చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్‌లను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఆటో, హమాలీ, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. మున్సిపల్ కార్మికులకు ఫిబ్రవరి నెల హెల్త్ అలవెన్సు, సమ్మె కాలంలో జీతం, సంక్రాంతి పండుగ బోనస్ వెంటనే చెల్లించాలని కోరారు. తడి, పొడి చెత్త సేకరించే వ్యాన్ డ్రైవర్లను మున్సిపల్ పరిధిలోకి తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో, తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మిక నాయకులు, మస్తాన్‌వలీ, వై.సరళ, షేక్ మౌలాలీ, లక్ష్మీప్రసన్న, బాణావత్తు రాణి, నాగలక్ష్మి, నేరెళ్ల సురేష్, నరేంద్ర పాల్గొన్నారు.



పోరంకిలో ప్రదర్శన చేస్తున్న కార్మికులు

గన్నవరం: కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని సీఐటీయూ నాయకుడు బెజవాడ తాతబ్బాయి విమర్శించారు. కార్మిక హక్కులను రక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో పలు కార్మిక సంఘాల నేతలు నిరసన తెలిపారు. తాతబ్బాయి మాట్లాడుతూ పాలకులు కార్మికుల హక్కులు పరిరక్షించాలని కోరారు. సంఘ నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు, సమ్మక్క, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మిక హక్కులు పరిరక్షించాలి

కంకిపాడు: ఉద్యోగ, కార్మిక హక్కులను పరిరక్షించాలని సీఐటీయూ మండల కార్యదర్శి తాడంకి నరేష్ డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక, ఉద్యోగ హక్కుల దినోత్సవం సందర్భంగా కంకిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు బుధవారం నిరసన చేపట్టారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి అనుగుణంగా పాలన విధానాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ యత్నాలను విరమించుకోవాలని సూచించారు. ఆశ, మధ్యాహ్న భోజనం, వెలుగు, సమగ్ర శిక్ష, మెప్మా, ఆయుష్, 108, 104 మొదలైన రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం గుర్తించి, కనీస వేతనాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు జి.కుమారి, రమా, కె.యలమంద, బి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

మురుగు సమస్యకు పరిష్కార చర్యలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మురుగు కాల్వల సమస్యను పరిష్కరించే దిశగా గ్రామ పంచాయతీ పనులు చేపడుతోంది. అందులో భాగంగా బుధవారం పడమర ఎలిమెంటరీ స్కూల్ నుంచి ముస్లిం శ్మశానవాటిక వరకు అనగా 700 మీటర్ల డ్రెయినేజీ కాల్వలు తవ్వకం పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. డ్రెయినేజీ కాల్వల తవ్వకం పనులు ఇరువైపులా చేపడుతున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ.రమణ తెలిపారు. గ్రామంలో అనారోగ్య సమ్యలు తలెత్తకుండా ఉండేందుకు ఆరోగ్యశాఖ సూచనల మేరకు డ్రెయినేజీ కాల్వల తవ్వకం పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పడమర బజారు ఎలిమెంటరీ స్కూల్ వెనుక వాగు బజారు నుంచి మురుగునీరు సక్రమంగా వెళ్లేందుకు సరైన మార్గం లేక ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉండి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తేవిధంగా ఉండటంతో డ్రెయినేజీ కాల్వల తవ్వకం పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు, స్కూల్ విద్యార్థుల ఆరోగ్య అవసరాల దృష్ట్యా ఈ పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.